సీరియల్ కథ :

# ప్రేమ పుష్పాలు!



రచన:

శ్రీ బుద్ధిరాజు నరసింహారావు

(గతసంచిక తరువాయి)

ఆసాయంత్రమే చక్రవర్తి, భాస్కరరావు కాంతంతో బండి ఎక్కారు.

మదనపల్లి సేనిటోరియంలో కాంతంని అడ్మిట్ చేసారు.

డాక్టర్ బాగా చెక్‌జేసి, నయం కావడానికి కనీసం మూడునెలలు పట్టవచ్చు, గాబరాపడ నవుసరంలేదు, అని హామీ ఇచ్చాడు.

* * *

చక్రవర్తి కాలేజీచదువు ఆపేసి ఉద్యోగప్రయత్నం చేసేడు. కాని అది సాధ్యపడలేదు. అతను నిరాశచెందుతూ వుండగా మళ్ళీ వామనరావు ఆదుకున్నాడు; అతను ప్రయత్నంచేసి మహారాజావారి ఏకాడమీలో చక్రవర్తిని ఎకౌంట్సు క్లర్క్‌గా వేయించాడు.

వామనరావంత గొప్పవాడు ఈలోకంలో మరొకడు వుంటాడా అని ఆశ్చర్యపోయాడు చక్రవర్తి, భాస్కరరావూ.

చక్రవర్తికూడా పనిలో చేరడంతో ఆర్థికస్థితి కాస్త సర్దుకుంది. వారానికోసారి భాస్కరరావు లేదా చక్రవర్తి మదనపల్లి వెళ్ళి వస్తున్నారు. దైవకృపవల్ల కాంతం త్వరగా కోలుకుంటోంది.

చక్రవర్తి వెళ్ళినప్పుడల్లా తల్లికి ఎంతగానో నచ్చ చెప్పేవాడు. ఎలాగైనా తల్లిహృదయంలో తిరిగి మామయ్యపై మంచి అభిప్రాయం కలిగించాలని అతని ప్రయత్నం.

రెండు నెలలకిపైగా దాటాయి.

జయసుధకూడా కాలేజి మానేసిందని చక్రవర్తికి తెలిసింది. కాని వాళ్ళింటికి వెళ్ళి మామయ్యని చూసివద్దామనుకున్నాడే కాని వ్యవధి దొరకలేదు.

* * *

ఆనాడు ఆదివారం.

తండ్రితోకలిపి చక్రవర్తి తల్లివద్దకు వెళ్ళారు. అనుకోకుండా వామనరావుకూడా అక్కడే కలిసాడు

'మొన్న మా అబ్బాయిని చూద్దామని వచ్చానండి. వాడిక్కడే ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈరోజే తిరిగి వెళ్ళిపోతూ వదినగార్ని చూసిపోదామని వచ్చాను' అన్నాడు వామనరావు.

'చాలా సంతోషమండీ' అంది భాస్కరరావు కంఠం.

C.K.C

ELEPHANT BRAND




**Carnataka Knitting Co.**

TIRUPUR - 638 602.

★

**Sales depot :**

No. 4-6-213, PAN-BAZAAR,

SECUNDERABAD - 500 003.

కాంతం కోలుకుంది. దగ్గు తగ్గిపోయింది. సేనిటోరియం చక్కటి వాతావరణ ప్రభావంవల్ల ఆమె ఆరోగ్యం త్వరగా చక్కబడింది.

ఆ మధ్యాహ్నం ఒక నర్సువచ్చి ఓ కవరు కాంతానికి అందించింది. 'మీ ఉత్తరమండీ!'

'ఉత్తరమా?' అందరూ ఆశ్చర్యపోయారు.

భాస్కరరావు ఆత్రుతగా అందుకుని ఎడ్రస్ చూసాడు. చూసి గతుక్కుమన్నాడు. వెనకాతల చలపతిరావు ఎడ్రస్ వుంది.

'ఎవరండీ వ్రాసారు?' కాంతం ఆత్రంగా అడిగింది.

భాస్కరరావు కొద్దిక్షణాలు తటపటాయించి మెల్లిగా, 'చలపతి' అన్నాడు.

'వద్దు. చింపి పారెయ్యండి. ఏం, యిక్కడకూడా స్థిమితంగా ఊపిరి పీల్చుకోనీయడా?'

'వదినగారూ, ఆవేశపడకండి. చూడండీ, నేను పరాయి వాడినైనా మీ అందరికన్నా ఆయువులో, అనుభవంలో పెద్దవాడిని. నామాట కాదనకండి. ఆవేశంలో, తొందరపాటులో మనకు తెలియకుండానే ఎన్నో పొరపాటులు జరిగిపోతూ వుంటాయి. అందుకే బాగా ఆలోచించి వాస్తవికం తెల్సుకుని చర్య తీసుకోవడం మంచిది. కాస్త ఓపికపట్టి అతనేమి వ్రాసాడో చూస్తే వచ్చే నష్టమేమీ లేదు.' వామనరావు నచ్చజెబ్తూ అన్నాడు.

'అవునమ్మా, నిజంగా తాతగారుకూడా అతను చెప్పబోయేది జీవితాంతం వినలేదు. నీవు కాస్త ఓపికపట్టి ఆ రోజు మాట్లాడినీయలేదు. పోనీ యిప్పుడైనా ఒక్కసారి శాంతంగా అతడేమివ్రాసాడో చూడమ్మా' ప్రాధేయపడ్డాడు చక్రవర్తి.

ఇక వాదించి ప్రయోజనంలేదని మెల్లిగా కవరు అందుకుని, 'సరే. మీమాటే వింటాను. కాని ఆ నీచుడు ఉత్తరంలో ఏమైనా కోరితేమాత్రం మీరు నన్ను బలవంతం చెయ్యకండి' అంది కాంతం.

'ముందు ఉత్తరం చదువు కాంతం!' అన్నాడు భాస్కరరావు.

కాంతం కవర్లోంచి నాలుగుపేజీల ఉత్తరం తీసి చదవటం ప్రారంభించింది.

'అక్కయ్యా! నా జీవితంలో లోకులు కాకులనే పదం చరితార్థమైంది. చివరిసారిగా ఒక్కసారి ఓపికపట్టి శాంతంగా నేను వ్రాయబోయేది ఆలకిస్తావనే ఆశతో వ్రాస్తున్నాను.

అక్కయ్యా, నేనేదో మహాపరాధం చేసినట్లు మీరంతా వెలివేసేరు, నేనంటే అసహ్యించుకున్నారు. కాని అక్కయ్యా, సీత మీరూహించినటువంటిది కాదు. సంఘంద్వారా విసర్జించిన బజార్లో పారేసిన మొగ్గకాదు. ఆమెకూడా నీతి నిజాయితీతో బ్రతికే అమ్మాయే. సీత, విధికీ, దారిద్ర్యానికీ, సంఘానికీ, దుష్టశక్తులకీ బలియైన ఒక కుసుమ కోమల జీవితం.

ఆమె తండ్రి కడుపేదవాడు. స్కాలర్‌షిప్పులతో సీత మెట్రిక్యులేషను వ్రాసింది. తల్లిముఖమే ఎరుగని సీతకు ఆ పేదతండ్రి సర్వస్వమూను. చివరికి ఆమెను యోగ్యుడైన యువకునితో వివాహం జరిపించాడు. కాని దురదృష్టవశాత్తు ఆ మూడోరోజున ఒక అగ్నిప్రమాదంలో ఆ యువకుడు మరణించాడు. మొన్నటి వధువు, నేడు వితంతువుగా మారింది. ఆబాధ భరించలేక తండ్రికూడా కనుమూసాడు.

దైవకృపవల్ల మెట్రిక్ పూర్తిచేసి వుండడంవల్ల ఓ నర్సరి స్కూలులో పని దొరికింది. ఎలాగో అతి కష్టం మీద తనబాధని మరిచిపోయే ప్రయత్నం చేయసాగింది సీత.

చిన్నపిల్లలకు పాఠాలు చెప్తూవుండేది. ఆమెయొక్క శ్రద్ధాభక్తులకూ, వినయవిధేయతలకూ అధికార్లు మెచ్చుకునేవారు.

కాని వారిలో ఒకడైన మోహనరావుదృష్టి ఆమెపై పడింది. అతడు చనువుగా మాట్లాడుతూ, కల్లబొల్లిలు చెబుతూ ఆమెదృష్టి సంసారిక సుఖాలవైపు మరల్చాడు. ఆమెలో దాగివున్న కోర్కెలూ, యవ్వనం ఆమెను కలచివేసాయి. పెళ్ళి చేసుకుని సంసారం చేసుకుందామనే వాంఛ ఆమెలో చెలరేగింది. పెళ్ళి చేసుకుందామని ఆమె ఎన్నిసార్లు చెప్పినా, ఏవో సాకులుచెప్పి మాట మారుస్తూ వుండేవాడు. అతను ఆమె అందచందాలని అనుభవిద్దామనే ధ్యాసతప్ప వివాహమాడే ఉద్దేశం లేనేలేదు. ఒకరోజున మోహనరావు నిగ్రహంతప్పి ఆమెను చేరబోతే, వివాహమైనతర్వాతే తనను చేరగలిగేదని స్పష్టంగా చెప్పింది.

అతను కలవారిబిడ్డ. మామూలుగా ఆమెతో చనువుగా తిరుగుతూ ఒకరోజున తనకు గుంటూరులో పుగాకు కంపెనీలో మంచి వుద్యోగం దొరికిందని, తాము తిరుపతి వెళ్లి పెళ్ళిచేసుకొని, గుంటూరులో కాపురం పెడదామన్నాడు.

సీత నమ్మింది. అతని సలహాపై స్కూల్‌లో రాజీనామా యిచ్చి అతనితో తిరుపతి బయల్దేరింది. అతను ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంటు కోచులో రిజర్వేషను చేయించుకున్నాడు.

ELLEN యెలెన్ ISI

మోటారు మరియు పంపులు

ఆంధ్ర ప్రభుత్వముచే అధికారము పొందియున్నది.



Totally. Enclosed Monoblock.

Manufacturers of :-

3 Phase Motors Pumps, Domastic Pumps Mono Blocks



Open Type Monoblock.

For PARTICULARS

**ELLEN INDUSTRIES**

Peelamedu, Coimbatore-641 004.

బ్రాంచి:

యెలెన్ ఇండస్ట్రీస్

7-3-177, ఘన్‌మండి, సికిందరాబాదు-3 (ఏ. పి.)

మోహనరావు ఎత్తు ఆమె అర్థం చేసుకోలేకపోయింది. రైలుబండి విజయవాడ చేరకముందే అతను ఆమెని బలాత్కరించారు....దోచుకున్నాడు. ఆమె అతనితో ఓడిపోయి మూర్ఛపోయింది.

తెలివొచ్చేసరికి కంపార్టుమెంటులో మోహన్ లేనే లేడు.

ఆమె బాధతో తిరిగి అదేస్కూల్‌కి వచ్చింది. సెక్రటరీ కాళ్ళావేళ్లా పడి మళ్ళీ పనిలో చేరింది. మోహన్‌ని వెదికింది. కాని అతనిజాడ తెలియలేదు.

మూడునెలల తర్వాత మోహన్ మళ్ళీ కనిపించాడు. ఆమె తనని త్వరగా పెళ్ళి చేసుకోమని వేడుకుంది, అతని పాదాలపై కన్నీరు కారుస్తూ తను తల్లి కాబోతున్నానని చెప్పింది. కాని, ఆమె ఎవరో తెలియదని వెళ్ళగొట్టాడా దుర్మార్గుడు.

గతిలేక ఆమె చావుకి సిద్ధమై గోదావరిలో దూకబోయింది. బాధతో ఆత్మహత్య చేసుకోబోయింది, దైవవశాత్తు ఆసమయానికి నేనక్కడే వున్నాను. ఆమెని రక్షించాను. ఆత్మహత్య చేసుకోవడం క్షమింపరాని నేరమని నచ్చజెప్పాను. ఆమె వాస్తవికం తెలుసుకున్నాను, తిరిగి ఆ దుర్మార్గుణ్ణి వేడుకోవడం లోకంలో నవ్వులపాలు కావడంతప్ప మరేమీ కాదని గ్రహించాను. ఎందుకంటే అతడివద్ద ఆస్తి వుంది. అంతకుమించిన అంతస్తు వుంది. గొప్పవాడిగా సంఘంలో చలామణీ అవుతున్నాడు. సంఘాన్ని తనవైపుకు తిప్పుకునే శక్తి వుంది అతడివద్ద. అందుకే వూరుకున్నాను.

ఆసమయంలో సీత నాకు నిజంగా అమాయకంగా, జీవితంలో మోసపోయిన స్త్రీగా కనిపించింది.

స్త్రీ ఒక మాతృమూర్తి. ఒక అక్కా, చెల్లి. అణువునా అనురాగంతో భర్తకు తోడూ నీడగా నిలిచే దేవతలాంటి భార్య.

నీవే చెప్పక్కా, యిన్ని ప్రతిభలతో నిండివున్న ఒక స్త్రీ నిండుజీవితం బలికావడం హృదయం, ఆలోచనాశక్తి వున్న ఏ మానవుడు సహించగలడు?

ఆసమయంలో ఆమెని ఆదుకొని, సంఘం ఆమెని గ్రద్దలవలె పొడిచి చంపకముందే, కాపాడటమే నాధర్మం. నాకర్తవ్యంగా భావించాను. అందుకే నేనామెని వివాహం చేసుకున్నాను.

ఆమెని వివశురాలిగా మార్చి యింకా అనుభవిద్దామనుకుని, నేనామెని వివాహం చేసుకోవడంవల్ల నిరాశజెంది, కక్షతో నేనొక సానిదాన్ని పెళ్ళి చేసుకున్నానని ఊరంతా సాటాడా అధముడు, ఎన్నో కట్టుకథలుచెప్పి అమ్మనీ, నాన్ననీ నమ్మించాడు. అమ్మా నాన్నల పరువుప్రతిష్ఠలు ధూళిలో కలిసిపోయాయి. అయినా నేను దృఢంగా నా నిశ్చయాన్ని విడువలేదు.





మేము అతి నూతనమైన యంత్రసాధనములను అమర్చి అతి సరసమగు, అత్యాకర్షణీయముగా, నేత్రానందకరమైన, జంకాళాలు మరియు బెడ్‌షీట్లను తయారించుచున్నాము. మహాశయులు మాకు చేయూతనిచ్చి అత్యధికముగా ఆర్డరు ఇవ్వవలెనని కోరుచున్నాము, మీ ఆర్డరును వెంటనే గమనించి సప్లయి చేయుదుము.

(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే)

**Sivakumar Industrials,**

**BHAVANI - 638 301.**

**P. B. No. 38.** **Phone No. 1265**

నేనొక మంచికార్యం చేసేనని. నా ధర్మం, నా కర్తవ్యం నెరవేర్చాననేతప్ప వేరె ధ్యాసే లేదు నాకు. ఆ తర్వాత నాన్నగార్కి శాంతంగాచెప్తే తప్పక వన్నర్థం చేసుకుని క్షమిస్తా రనుకున్నాను. కాని. నా ఆశలన్నీ తల్లకిందు లైనాయి. ఆయన నామాట వినకుండానే నన్నూ నా భార్య నూ యింటినుండి వెళ్ళగొట్టారు

అప్పుడు నిజంగా నాన్నగారిమీద అంతులేని కోపం, ఉద్రేకం వచ్చింది. ఇరుగు, పొరుగు మాటలు విని నమ్మ వచ్చుకాని, తన కన్నకొడుకు చెప్పేది శాంతంగా విని, నిజం తెల్సుకోడానికి ఆయన కంత ఓపిక లేదా అని నా హృదయం విలవిల లాడింది.

తరువాత విజయవాడలో వున్న నా బాల్యమిత్రుడిదగ్గరకు వెళ్ళిపోయాను. అతనే సేట్ రామలాల్‌వద్ద నాకు ఉద్యోగం యిప్పించాడు.

అక్కయ్యా, నాన్నగారు చివరిదశలో నన్ను రమ్మన మని ఉత్తరాలు వ్రాసారన్నావు. కాని అవి నాకు అంద లేదు. అందివుంటే తక్షణం ఆయన పాదాలకడ వాలి వుండేవాడిని. కాని మించిపోయింది. నాకా అదృష్టమే లేదు.

సరే.—

అయిపోయిందిలే అక్కయ్యా. నా ఒంట్లోకూడా అసలు బాగుండటం లేదు. ఏక్షణాన కళ్ళు మూతలు బడతాయో చెప్పలేను.

నీకు గుర్తుందక్కయ్యా?

నేను చిన్నగా వున్నప్పుడు నీ ఒడిలో ఎలా తల పెట్టుకు పడుకొని నీచేత 'బాబూ నిద్దురపోరా' అనే పాట పాట పాడించుకు మరీ పడుకునేవాడిని.

నా జీవనదీపం ఆరేయుందు, అలాగే నీఒడిలో తల పెట్టుకుని నీ చక్కని పాటవింటూ, శాశ్వతంగా కను మూయాలని వుందక్కయ్యా.

కాని ఏంలాభం. నీకుకూడా నేనంటే అంతులేని అస హ్యమైపోయింది. నా దురదృష్టం. పెద్దక్కయ్యా; అలా ద్వేషంతో నావైపు చూడకక్కయ్యా. జీవితాంతం నే భరిం చింది ఆ చూపులే కదా!

మరి శెలవక్కయ్యా.

అభాగ్యుడైన నీ తమ్ముడు,

చలపతి.


## 'ఎస్' బీడీల ఎగుమతి




కెనడా, స్విట్జర్‌లాండ్, ఆస్ట్రేలియా, అమెరికా మున్నగు అనేక దేశాలకు, మెస్సర్సు. ఎ. హబీబిర్ రహమాన్ అండ్ సన్సు. గుడియాత్తంవారు ఉత్పత్తి చేయు 'ఎస్' బీడీలు ఎగుమతి అవుతున్నాయి. అంతేకాదు, అనేక ఇంటర్నేషనల్ ఫైర్సులో వీటిని ప్రదర్శనమునకు పెట్టారు. జర్మనీ (లిప్‌జిగ్‌ఫైర్) స్వీడన్, బెల్జియం, సింగపూర్ మున్నగు దేశాలలోనే కాక, అనేక ఆఫ్రికన్ దేశాలలోని ప్రదర్శనాలలో కూడా వీటిని ప్రవేశపెట్టారు. 'ఎస్' బీడీలకు వారు తయారుచేసిన 20 శాల్తీలు గల సిగరెట్ పెట్టెవంటి పాకెట్లో కొత్త రూపు, అందచందాలు కూడా ఏర్పడ్డాయి.

ఆద్యంతన భవిష్యత్తులో అమెరికా, యూరోపు ఖండాలలో నాగరిక ప్రజలలో సైతం అభిమానులను పెంచుకొని 'ఎస్' బీడి సుస్థిరమైన స్థానం ఆక్రమించగలదను నమ్మిక ఏర్పడ్డది. ప్రాచ్య ప్రాశ్చాత్య దేశాలలో లభించిన విశేష ప్రోత్సాహం దానిని దృఢపరుస్తున్నది.

ఆ ఉత్తరం కాంతం కన్నీటితో తడిసిపోయింది, హృదయం ముక్కలు ముక్కలైనట్లు వెక్కి వెక్కి ఏడుస్తూ, 'బాబూ. చలపతి నన్ను క్షమించరా, అంది

అందరూ నివ్వెరపోయారు.

భాస్కరరావు మందలిస్తూ, 'కాంతం, ఏమిటిది. కన్నీరెందుకు?' అనబోయాడు.

అతనివాక్యం పూర్తిగాకముందే కాంతం భరించలేని ఆవేదనలో, 'వద్దండీ. ఈబాధ నేను భరించలేను. నన్నేడ్వనీయండి చలపతి ఎంత మనోవేదనికి గురయ్యాడో యిప్పు డర్థమైంది, వాడు నిజంగా ఉత్తముడు. వాడి నెవరూ అర్థం చేసుకోలేకపోయారు. చివరకు నేనుకూడా! పాపం. అత్యుత్తమమైన ఆశయాలతో మానవజన్మను సార్థకం చేసుకున్న మహాపురుషుడిని అపనిందలపాలు చేసాము. అయ్యయో' అంటూ భోరుమంది.

చక్రవర్తి అర్థం కానట్లు తల్లివైపే చూస్తున్నాడు.

అంతవరకూ ప్రేక్షకుడిలా తటస్థంగా కూర్చున్న వామనరావు అందుకున్నాడు. 'వదినగారూ, మీతో అబద్ధం చెప్పినందుకు నన్ను క్షమించాలి.'

'అబద్ధమా?' భాస్కరరావు ఆశ్చర్యంగా అతనివైపు చూసాడు.

'అవును. వదినగారి చికిత్సకి యిచ్చిన మూడువేల రూపాయలు నావి కావు!'

'ఏమిటీ?' భాస్కరరావు వింతగా అన్నాడు?

'అవునండీ. వదినగార్కి అసలు ఒంట్లో బాగులేదని, డాక్టర్ ఆమెని యిక్కడకు తీసుకువెళ్ళమన్నారని, మీ ఆర్థికస్థితి బాగులేదని చలపతిరావుగార్కి ఎలాగో తెలిసినట్లుంది. ఆయన ఓరోజు నాతోకలసి ఆడబ్బు యిచ్చాడు. అతను తనయిల్లు తాకట్టుపెట్టి మూడువేలు అప్పుచేసాడు. మీకు నిజంచెప్తే తీసుకోరని అపహ్యాంచుకుంటారని, నా ద్వారా మీకు సహాయం చేయించాడు. చక్రవర్తికి ఉద్యోగంకూడా అతనే యిప్పించాడు, ఒట్టు పెట్టడంవల్ల యింత వరకూ మీకు నిజం చెప్పలేకపోయాను. కాని ఎప్పటికప్పుడు బాధపడుతూనే వున్నాను. పరిస్థితులు మారడంవల్ల, దాచలేక మీతో నిజం చెప్పేస్తున్నాను వదినగారూ. అతడిలాంటి ఉత్తముడు తండ్రయినా, కొడుకైనా, అన్నయినా, తమ్ముడైనా జీవితాంతం గర్వపడాల్సినవిషయం. మరి.'

వామనరావుమాట పూర్తికాకుండానే, 'ఏమండీ; వినలేనండీ. నేనీవేదన యిక భరించలేనండీ. పదండి బాబు చలపతివద్దకు నన్ను తీసుకెళ్ళండి. నన్ను క్షమించమని వేడుకుంటాను, ఏమిండీ యిప్పుడే పదండి' ఆవేశంగా ఆయాసపడుతూ కాంతం లేచింది.

'శాంతించు కాంతం. ఆవేశం పనికిరాదు.' భాస్కరరావు వారించబోయాడు.

'శాంతి, చలపతిదగ్గర. క్షమాభిక్ష కోరుకొనేదాకా నాకు శాంతి లభించదండీ. పదండి వెళ్దాము.' కాంతం వణికిపోయింది. పశ్చాత్తాపంతో ఆమె కళ్ళవెంట ఏకదారగా కన్నీరు కారుతూనే వుంది.

చక్రవర్తి లేచి తల్లిభుజం పట్టుకున్నాడు.

'పడుకో అమ్మా, నీకు నయమయ్యాక తప్పకుండా వెళ్దాము.'




జుపిటర్ వారి అత్యుత్తమమైన తయారింపులు!

• జిపిటర్ ఫైన్ • వెస్టన్ • షోర్
• కూల్ టెక్స్ • విజయ్ • కాస్మో

మీరు బనియన్లు కొనే ముందు "జుపిటర్" మార్కు వున్నదా అని చూచి కొనండి.

హైదరాబాదు - సికిందరాబాదు మినహా అన్ని చోట్లలో ఏజెంట్లు కావలెను.

——— తయారించువారు ———

Grams : JUPITER Phone: 20670

Jupiter Knitting Company
Lakshminagar Main Road,
TIRUPUR - 638 602.

'వద్దు. నేనుండలేను.'

'నేను డాక్టర్‌ని ఓ రెండురోజులకోసం డిస్‌చార్జ్ చెయ్యమని చెప్తాను. భాస్కరరావుగారూ, ఈ పరిస్థితులలో అక్కా తమ్ముడూ కల్సుకుంటూనే మేలనుకుంటా.' అంటూ వామనరావు బయటకు నడిచాడు.

* * *

భలపతిరావు యింటిముందు టాక్సీ ఆగింది. అందు లోంచి భాస్కరరావూ తల్లిని పట్టుకుని చక్రవర్తి క్రిందికి దిగారు.

ఆ యింటిబయట తలుపు బార్లా తీసివుంది.

ముందుగదిలో ప్రవేశించారు వారందరూ.

గదిలో అడుగుపెట్టగానే చక్రవర్తి స్తబ్దుడై అలానే నిలబడిపోయాడు. తనువునిండా తేళ్లూ, జెర్రెలూ ప్రాకు తున్నట్లనిపించింది.

ఎదురుగా కుర్చీలో కూర్చుని వెక్కివెక్కి ఏడుస్తోంది జయసుధ. జుట్టు రేగిపోయింది. ముఖం పాలిపోయివుంది. ఆమె ప్రక్కగా కూర్చున్న ప్రేమ్‌కుమార్ అప్యాయంగా ఆమె తలనిమురుతూ ఏదో అంటున్నాడు.

చక్రవర్తిగుండె జోరుగా కొట్టుకుంది. ప్రేమ్‌కుమార్‌ని చూడగానే అంతులేని ఉద్రేకంతో కంపించిపోయాడు చక్రవర్తి: అతని తల్లి తండ్రీ ఏమీ అర్థం కానట్టు కొడుకు వైపే చూస్తుండిపోయారు.

జయసుధ, ప్రేమ్‌కుమార్ వారిరాక గమనించలేనట్లుంది.

'జయా, జరిగిపోయినదానికి విచారించి లాభంలేదు.'

'ఇక జీవితంలో మిగిలినదేమిటి ప్రేమ్, అంతా అయి పోయింది, నా సర్వస్వం.'

అంతే: చక్రవర్తి తన నిగ్రహశక్తి కోల్పోయాడు. పళ్లు పటపట కొరకాడు.

'ఏంరా స్కౌండ్రల్. చివరకు కోరుకున్నది సాధించేసా వన్నమాట.' బిగ్గరగా పిచ్చివాడిలా అరిచాడు చక్రవర్తి.

పిడుగులాంటి గొంతు వినగానే ఉలిక్కిపడి యిద్దరూ లేచి నిల్చున్నారు.

'ఓ మీరా.' జయసుధమాట పూర్తికాకుండానే, 'నే నంతా అర్థం చేసుకున్నా జయా. నిన్ను వంటరిగా గమ నించి ఈ రాస్కెల్ నీ పరువూ ప్రతిష్ఠలూ...పాపాత్ముడా. నిన్ను నరికి పారేసినా పాపం లేదు.' అని చక్రవర్తి ప్రేమ్ కుమార్‌వైపు ఉరికాడు.

'చక్రవర్తీ, నామాటవిను' ప్రేమ్‌కుమార్ ఏవో అన బోయేలోపలే చక్రవర్తి తనమీద పడడంతో మాట మధ్య లో ఆగిపోయిం దతనికి.

చక్రవర్తి పిడికిలి బిగించి ప్రేమ్‌కుమార్ ముఖంమీద బలంగా గుద్దాడు'

'నామాట, నామాట విను.'

'నీకు బుద్ధి చెప్పేదాకా నీమాట వినేదిలేదురా దుర్మా ర్గుడా.'

ప్రేమ్‌కుమార్ ముక్కులోంచి రక్తం కారింది. దానితో ప్రేమ్‌కుమార్‌కి అంతులేని ఉద్రేకం వచ్చినట్లుంది. అమాంతం శక్తినంతాకూడ బలుక్కుని చక్రవర్తి నొక తోపుతోసి వీపుమీద తన్నాడు, ఆ దెబ్బకి చక్రవర్తి విలవిల లాడిపోయాడు.

అంతా క్షణకాలంలో సాగిపోయింది. అంతా అణుస్థా వుల్లా నిలబడే వుండిపోయారు. జయసుధ మూగబోయిన దానిలా, శిలాప్రతిమలా అలాగే నిలబడింది.

ప్రేమ్‌కుమార్ క్రిందపడ్డ చక్రవర్తిని బలంగా నొక్కి పెట్టి, 'చక్రవర్తీ, ఉద్రేకంలో మనిషి పశువుగా మారు తాడు. తొందరపాటు ఉచితంకాదు. శాంతంగా విను:'

అప్పుడే జయసుధ తేరుకున్నదానిలా అరిచింది, 'ప్రేమ్ అతణ్ణి వదులు. నిజం నేను చెప్తా.'

ప్రేమ్‌కుమార్ దూరంగా జరిగాడు.

చక్రవర్తి లేచి ఆశ్చర్యంగా అడిగాడు, 'ఏమిటి జయా, నీవంటున్నది: నిన్ను దోచుకున్న ఈ దుర్మార్గుడ్ని.'

'చక్రవర్తి, ప్రేమ్ నాకెటువంటిద్రోహం తలపెట్టలేదు. అతను నాకు కాబోయే భర్త:'

'భర్తా.' చక్రవర్తికి భూమి గుండ్రంగా తిరుగుతున్న ట్లనిపించింది. తెల్లబోయి జయసుధవైపుచూస్తూ అలాగే వుండిపోయాడు.

అది గమనించి కాంతం జయసుధతో అంది, 'అమ్మా, జయా, నేనేనమ్మా, నీ అత్తని.'

జయసుద ఆమెమాట విననట్టు చక్రవర్తీవైపే చూస్తూ, 'చక్రవర్తి, తప్పు నీదికాదు, నాదీకాదు. పరిస్థితు లిలామారి మనమధ్య అగాధం ఏర్పడడానికి కారకు లెవరు?'

చక్రవర్తి కోలుకున్నాడు, 'జయా, నాకేమీ అర్థం కావడంలేదు, మనిద్దరిమధ్యా మళ్ళీ ప్రేమ్‌కుమార్ ఎలా వచ్చాడు. అవి గతచరిత్ర.

మాట పూర్తి కానీయకుండానే ప్రేమ్‌కుమార్ ముం దుకువచ్చి అన్నాడు, 'చక్రవర్తీ, నన్నపార్థం చేసుకోకు. అంతా దైవనిర్ణయంవలె జరిగిపోయింది. సత్యమేమిటంటే, ఆనాడు నేను చేసిన పాపాలకు పశ్చాత్తాపపడి ఈ ఊరు వదలి, మా పెద్దనాన్నగారింటికి వెళ్ళిపోయాను. అక్కడ

ఉద్యోగంచేస్తూ జీవితం గడపసాగాను. రెండురోజులక్రితం మా పెద్దనాన్నగారు తన ప్రాణమిత్రుడు చరమదశలో నున్నాడని, అతనిని చూడాలని, నన్ను తీసుకు ఈ ఊరు వచ్చారు. మేము వచ్చేసరికి చలపతిరావుగారు గంభీరస్థితిలో వున్నారు. నన్ను చూడగానే, నాకసలు ఆలోచించుకునే వ్యవధిలేకుండా జయ చేయి నాచేతిలో....

'అర్థమైనదా చక్రవర్తీ! పెద్దల మనస్పర్థలూ, అంతు లేనిభేదాలూ, పట్టుదలలూ మనని వేరుచేయడానికి కారణం. ఈనాడు మన నిండుమనసులు నాశనమవడానికి కారకు లెవరు? ఇదిగో, మీ అమ్మ!' అంది ఆవేశంతో జయసుధ.

'జయా!' ఏదో అనబోయాడు చక్రవర్తి.

కాంతం ఆవేదనగా ముందుకు వచ్చింది. 'అవునమ్మా, నువ్వన్నది ముమ్మాటికీ నిజం. నేను చేసిననేరానికి మీరే శిక్ష విధించినా హాయిగా భరిస్తానమ్మా. నన్ను ముక్కలు ముక్కలుగా నరికినా సంతోషమే.'

'మిమ్మల్ని అత్తయ్యా అని పిలవాలంటేకూడా నా కసహ్యం వేస్తోంది. ఈ వినయవిధేయతలు ఆనాడు ఎక్కడికి పోయాయి? ఎంతో సంతోషంగా నాపెళ్ళిమాటలు జరుపుదామని మీయింటికివస్తే మానాన్నను చిత్రహింస చేసేరే. జీవితాంతంవరకూ ముఖం చూపవద్దని ప్రమాణం చేసేరే? వెళ్ళండి, మాయింటినుండి వెళ్ళండి. కాంతమ్మ గారూ వచ్చినదారినే తిరిగి వెళ్ళండి!'

'జయా!' తల్లిని జయసుధ అంతగా అవమానపాలు చెయ్యడం భరించలేక కోపోద్రేకంతో గర్జించాడు చక్రవర్తి.

'ఒహో, అబ్బాయిగారికి అంత పౌరుషం వచ్చిందా. ఆనాడు సూటిపోటి మాటలతో మీ అమ్మ అమాయకుడైన మా నాన్నని చిత్రవధచేస్తూవుంటే ఎక్కడికి పోయింది మీ పౌరుషం' తారాజువ్వలా లేస్తూ, బాధతో, కసితో, అంతు లేని ఆవేదనతో బిగ్గరగా అరచింది జయసుధ.

చక్రవర్తికి ఓపిక నశించింది. ఛెళ్ళున లెంపకాయ కొట్టాడు.

కాంతం అదిరిపడింది. భాస్కరరావు ముందుకువచ్చి కొడుకుచెయ్యి పట్టుకున్నాడు. ప్రేమ్‌కుమార్ ఆవేశంగా ముందుకు రాబోడు.

జయసుధ ప్రేమ్‌కుమార్‌కి అడ్డువచ్చి కన్నీరు నిండిన కళ్ళతో వెక్కి వెక్కి ఏడుస్తూ రుద్ధకంఠంతో బిగ్గరగా, 'కొట్టు. నీవు నా బావవుకదూ. పెద్దవాడివి. నన్ను కొట్టే హక్కు నీకుంది. యింకా కొట్టు. కాని, కాని మా, నాన్నకు జరిగిన అవమానం నేను జన్మజన్మలకీ మరచిపోలేను' అంది.

భాస్కరరావు శాంతంగా, 'అమ్మాయి జయా, శాంతించమ్మా. మీనాన్న నిజంగా గొప్పవాడమ్మా. మీ అత్తయ్య అతన్ని అర్థం చేసుకోలేకపోయింది. నిజం తెల్సుకుని మీ అత్తయ్య ఎలా కుమిలిపోతున్నదో నీకు తెలియదమ్మా. ఊరుకోమ్మా. మా బంగారుతల్లి వికదూ, అన్నాడు.

సానుభూతి పూరితమైన భాస్కరరావు మాటలకి జయసుధకి బాధ మరీ ఎక్కువైంది. హృదయం ముక్కలై పోయినట్లు భోరుమని ఏడ్చేసింది.

(సశేషం.)


LAKSHMI
WET GRINDERS
21 YEARS GLORIOUS SERVICE
SRI LAKSHMI INDUSTRIES
25 DEVANGA HIGH SCHOOL ROAD
COIMBATORE 641 002 • PHONE: 31689
MANUFACTURERS

EXPORTERS
శ్రీ లక్ష్మి
వెట్ గ్రైండర్స్
గత 21 సంవత్సరాల నుంచీ
ప్రసిద్ధి చెందినది.

సీరియల్ కథ:

# ప్రేమ పుష్పాలు!

★



రచన:

శ్రీ బుద్ధిరాజు నరసింహారావు

(గతసంచిక తరువాయి)

కొంతం ఆమె దగ్గరగా వెళ్ళి ఆమె భుజంమీద చేయి వేసింది, "అవునమ్మా...వాడితో క్షమాపణ కోరుకోడానికే వచ్చాను."

"వద్దు...నన్ను తాకవద్దు...క్షమాభిక్ష...క్షమాభిక్ష కావాలా...అది మీకు జీవితాంతం దొరకదు ... హాయిగా ఆడుతూ పాడుతూ బ్రతికే మా పరివారమే నాశనమై పోయాక క్షమాభిక్ష వేడుకోడానికి వచ్చారా...రండి...తీసుకోండి...పాదాలపై బడి క్షమాభిక్ష వేడుకోండి..." జయసుధ రెచ్చిపోతూ పిచ్చిదానిలా మరో గది వైపు పరుగు తీసింది. అందరూ మౌనంగా ఆ గది వైపు వెళ్ళారు. జయసుధ మూసివున్న తలుపుని ఒక్క తోపు తోసింది.

ప్రేమ్‌కుమార్ తప్ప మిగతా వారందరూ ఆశ్చర్యపోయారు. చక్రవర్తి స్తబ్ధుడై లోపలికి చూసాడు. నేలమీద చాప పరచి వుంది దానిపై సీతా, ప్రభా గాఢనిద్రలో వున్నారు

"వెళ్ళండి...కోరుకోండి...ఆ దేవతే మా అమ్మ...అమాయకంగా జీవితంలో దగాపడి - నాన్ననే ఆరాధిస్తూ బ్రతుకుతున్న స్నేహమయి ...అమృతమూర్తి మా అమ్మ...వెళ్ళండి...ఆమెని క్షమాభిక్ష కోరుకోండి..."

ఆమె ఆవేశానికి ప్రేమ్‌కుమార్ ఆమెని మందలిస్తూ "జయా...శాంతించు" అన్నాడు.

భాస్కరరావు ఆమెని ఓదార్చాడు, "అమ్మాయి...ఊరుకోమ్మా."

జయ శాంతించలేక పోయింది, "ఎందుకత్తయ్యా అలా ఆశ్చర్యంగా చూస్తావు...వారిద్దరూ అంతులేని బాధకి గురయ్యారు. అందుకే డాక్టర్ వారిని యింజెక్షనిచ్చి పడుకోబెట్టు

న్నారు...మిగిలింది నేను...చావలేను బ్రతకలేను. ఎందుకంటే...ఎందుకంటే...మమ్మల్ని ప్రాణపదంగా పెంచిన...జీవితంలో ఏ పాపమూ ఎరుగని మా నాన్న...మా నాన్న చచ్చిపోయాడు!'' భోరుమని ఏడ్చేసింది.

పిడుగులా పడిందా వార్త! అందరూ స్తంభించి పోయారు. కాంతం ఉద్రేకంతో, బాధతో బిగ్గరగా అరిచింది, ''బాబూ...చలపతీ...''

''అంతే కాదు. క్షమాభిక్ష పెట్టమంటూ ఆఖరి సారిగా విలవిలా కొట్టుకు మరణించాడు మా నాన్న. ఆగండి...'' అని గదిలోకెళ్ళి ఒక మడిచిన కాగితం తెచ్చి కాంతం చేతిలో పెట్టి, ''ఆఖరి సారిగా...ఊపిరి పోయేముందు వణుకుతున్న చేత్తో మీకో కానుక వ్రాసి ఇచ్చాడు.'' అంది ఆయాసంతో.

కాంతం వెక్కి-వెక్కి ఏడుస్తూ కాగితం మడత విప్పింది. వంకరగా కొన్ని గీతలు—

''అక్కయ్యా!

పోతున్నా నక్కయ్యా...జీవితంలో ఓడిపోయి వెళ్ళిపోతున్నా నక్కయ్యా! నీకు ఉత్తరం వ్రాసాను కదా...అది చదివి నన్ను క్షమించి తప్పకుండా నా దగ్గరికి వస్తావని తెలుసు...నీ హృదయం నాకు బాగా తెలుసు. కానీ, ఆ నాడు నీవు ఒట్టు పెట్టుకున్నావు గుర్తుందా, అక్కయ్యా! బ్రతికుండగా నీకు ముఖం చూపించవద్దన్నావు. నీ మాట నిలబెడతానని మాటిచ్చాను, గుర్తుందా?...అందుకే వెళ్ళిపోతున్నాను. నీకీ ముఖమెలా చూపను అక్కయ్యా?

నీ ఒడిలో శాశ్వతంగా కను మూయాలనే నా కోరిక! కాని...ఈ జన్మలో సాధ్యపడదు. వచ్చే జన్మలో - నీ కడుపున తప్పక పుడతానక్కయ్యా...అబ్బ...

నీ...చల...''

అంతే!

ఉత్తరం పూర్తి కాగానే బిగ్గరగా అరచి నేల కూలిపోయింది కాంతం.

* * *

కాంతం అనారోగ్యం మళ్లా మొదటికి రావడంతో ఆమెని తిరిగి మదనపల్లి సెనిటోరియంలో జాయిన్ చేసారు.

భారంగా వారం రోజులు గడిచాయి.




జుపిటర్ వారి అత్యుత్తమమైన తయారింపులు!

• జుపిటర్ ఫైన్ • వెస్టన్ • షోర్
• కూల్ టెక్స్ • విజయ్ • కాస్మో

మీరు బనియన్లు కొనే ముందు ''జుపిటర్'' మార్కు వున్నదా అని చూచి కొనండి.

హైదరాబాధు - సికిందరాబాదు మినహా అన్ని చోట్లలో ఏజెంట్లు కావలెను.

—— తయారించువారు ——

Grams : JUPITER Phone : 20670

**Jupiter Knitting Company**

Lakshminagar Main Road,

TIRUPUR - 638 602.

ఆనాడు తల్లి మూర్ఛ పోగానే హడావిడిగా అక్కడనుండి వచ్చేసారు వారందరూ! తర్వాత చక్రవర్తి ఆ యింటి వైపే వెళ్ళలేదు. వెళ్ళడానికి మనసొప్పలేదు.

ఎలా వెళ్తాడు?

ఏది తన గమ్యస్థలమో తెలుసుకోలేక సతమతమౌతున్నాడు చక్రవర్తి.

తండ్రి భాస్కరరావు మదనపల్లి వెళ్ళేడు.

ఆ రోజు కుర్చీలో కూర్చుని తదేకంగా ఆలోచిస్తున్నాడు చక్రవర్తి.

బయట పెద్దగా ఉరుములూ, మెరుపులూ! సాయంత్రం నాలుగు కాకుండానే కారుమబ్బులు దట్టంగా ఆకాశాన్ని కప్పి వేయడంతో వాతావరణం మసక మసకగా తయారైంది.

అంతులేని ఆలోచనలతో చక్రవర్తి మెదడు వేడెక్కి పోతోంది.

తనూ, జయసుధా కలసి ఎంత చక్కని కలలు కన్నారు...కాని, పరిస్థితులు తారుమారయ్యాయి. ఎన్నెన్నో వాగ్దానాలు చేసుకున్నారు వారిద్దరూ. జీవితాంతం యిరువురూ తోడూ నీడగా బ్రతుకుదామని జీవితంపై ఎన్నో ఆశలు పెంచుకున్నారు. కాని, ఆ మధుర స్వప్నాలన్నీ పగటికలలై వారిని వెక్కిరించిపోయాయి. పెద్దల మనస్పర్థలకీ, అంతులేని రాగద్వేషాలకీ, పోరాటాలకీ వారిద్దరి నిండు మనసులు తీరని ఆవేదనకి గురయినాయి. జీవితాంతం ఆ మనోవేదన భరించే శక్తి అతడికి లేదు...జీవితం భారంగా తయారైంది.

అంతలో బయట తలుపు చప్పుడు కావడంతో అతని ఆలోచనలు చెల్లా చెదరై పోయాయి.

భారంగా లేచి తనువులో శక్తి లేనట్లు కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి తలుపు తీసాడు చక్రవర్తి.

అంతే!

స్తబ్ధుడై అలాగే నిలబడి పోయాడు.

ఎదురుగా ప్రేమ్‌కుమార్, జయసుధా!

అప్పుడే వారి రాకకై నిరీక్షిస్తున్నట్లు బయట హోరుమని వర్షం ప్రారంభమైంది. దూరంగా ఎవరో వీణ వాయిస్తున్నట్లుంది ... ఆ రాగం వర్షం హోరులో అద్భుతంగా వినవస్తోంది.

కొద్ది క్షణాలకి తేరుకుని, "లోపలికి రండి." అని చక్రవర్తి వెనక్కి తిరిగాడు.

జయసుధ లోపలికి వచ్చింది. ప్రేమ్‌కుమార్ లోపలకి వచ్చి తలుపు మూసాడు.

వారెందుకు వచ్చారో అర్థం కాలేదు చక్రవర్తికి.

ఊపిరి బిగపెట్టుకుని మౌనంగా కుర్చీ చూపించాడు. ఏదో అడగాలని మెల్లిగా, "బాగున్నావా జయా...అత్తయ్య ఎలా వుంది...ప్రభ కులాసాయేనా?" అన్నాడు చక్రవర్తి.

జయసుధ, "కాస్త నయంగా వున్నారు" అంది కుర్చీలో కూర్చుంటూ.

ప్రేమ్‌కుమార్ కొద్ది క్షణాలు దీర్ఘంగా చక్రవర్తి వైపు చూసాడు.

మాసిన గడ్డం...మాసి, నలిగిన బట్టలూ... చెదిరిపోయిన జుట్టూ ... మనిషి చాలా చిక్కిపోయినట్లు కనబడ్డాడు.

"చక్రవర్తి...మీ అమ్మగారు బాగున్నారా?" అనడిగేడు ప్రేమ్‌కుమార్.

"ముందుకన్నా కాస్త నయమే."

"నీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలని వచ్చాను...యింతవరకూ మనం ఎన్నడూ మిత్రులుగా మసలుకోలేదు. అందుకే చేతులు కలుసుకుని మిత్రులౌదాము...ఏం ... అభ్యంతరమా?" అంది ప్రేమ్‌కుమార్ కంఠం!

చక్రవర్తి మౌనంగా కుడిచేయి అందించాడు. తర్వాత జయసుధతో, "జయా... నీవన్నా ప్రేమ్‌కుమారన్నా నా కెటువంటి దురభిప్రాయం లేదు. జరిగినదేదో జరిగిపోయింది...

దానివల్ల యిక బాధపడి ప్రయోజనముండదు. అందుకే గతం మరచి ప్రేమ్‌కుమార్‌తో నూతన జీవితం ప్రారంభించు. నీవు సుఖంగా వుంటే, అంతకన్నా నాకు కావలిసింది మరేమీ లేదు'' అన్నాడు నిట్టూర్పు విడుస్తూ.

''అదికాదు చక్రవర్తీ...నే చెప్పే విషయం శాంతంగా విను'' ప్రేమ్‌కుమార్ గొంతుక.

చక్రవర్తి కళ్ళు అతని కళ్ళతో అప్రయత్నంగానే కలిసాయి. ప్రేమ్‌కుమార్ కళ్ళల్లో భావం అతనికి అర్థం కాలేదు. జయసుధమాత్రం తలదించుకుని మౌనంగా కూర్చుంది.

కొద్దిక్షణాలు మౌనంగా గడిచాయి. గదిలో నిశ్శబ్దం ఆవరించింది.

తర్వాత ప్రేమ్‌కుమార్ గొంతు సవరించుకుని గంభీరంగా, ''చక్రవర్తి...పెద్దల ద్వేషాలకీ, మనస్పర్థలకీ, మూఢాచారాలకీ మనసులు కలసి పవిత్రంగా నిర్మల హృదయంచే ఒకరినొకరు ప్రేమించుకున్న జంటలు ఎన్నడూ వేరు కాకూడదనే నా అభిప్రాయం. నేను అజ్ఞానంగా ఎన్నో చెడు పనులు చేసేను. మనసుకు నచ్చిన అమాయకురాలైన అమ్మాయిలతో నాటకాలాడి, ప్రేమ వ్యవహారాలు జరిపి, నా కోరికలు తీరేక మోసం చేసేను. చివరికి నే చేసిన పాపాలకి ప్రతిఫలంగా నా చిన్నారి చెల్లెలి నిండు ప్రాణం బలైపోయింది. నేను అంతులేని ఆవేదనకు గురై ఎలాగో తట్టుకుని మంచివాడుగా బ్రతుకుదామనుకున్నాను. కాని మరో సమస్య వచ్చి పడింది...దానిని పరిష్కరించి నన్ను కాపాడే శక్తి నీ ఒక్కడికే వుంది'' అంటూ చక్రవర్తివైపు ఆశగా చూసేడు.

అర్థంకానట్లు చక్రవర్తి తలదించుకుని కూర్చున్న జయసుధ వైపొకసారి చూసి, తిరిగి ప్రేమ్‌కుమార్ వైపు చూస్తూ, ''నేనా?... చెప్పు ప్రేమ్ ... నీ కోసం నేనేమైనా చేస్తాను''.

''మాటివ్వగలవా?''

''దైవసాక్షిగా చెప్తున్నాను.''

ప్రేమ్‌కుమార్ జాపిన చేతిమీద చేయి వేసాడు చక్రవర్తి.

''జయా...నీ కుడిచేయి యిలా యిస్తావా''

''ప్రేమ్...ఏమిటిది?'' చక్రవర్తికి అతడి వ్యవహారం అర్థం కాలేదు.

జయసుధ చేతిలో చక్రవర్తి చేయి కలుపుతూ, ''జీవితంలో ప్రథమసారిగా నే చేస్తున్న మంచి పని యిదొక్కటే...చక్రవర్తి...జయి ఈనాడే నన్ను మనస్ఫూర్తిగా క్షమించింది... ఎందుకో ఈనాడే నా చిన్నారిచెల్లెలి ఆత్మకు కూడా శాంతి లభించినట్లుంది ... చక్రవర్తీ... జయ ఎప్పటికీ నీదే...ఆమెకి ఎప్పుడూ ఎటువంటి కష్టం కలగనీయకుండా జాగ్రత్తగా చూసుకో'' అన్నాడు ప్రేమ్‌కుమార్.

చక్రవర్తీ, జయసుధా, కలసి వున్న చేతులతో అలాగే స్తబ్ధులై ప్రేమ్‌కుమార్ వైపు ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయారు.

ప్రేమ్‌కుమార్ కాస్త దూరం జరిగి, ''జయా ...చక్రవర్తీ...వికసించిన మీ జీవన పుష్పం ఎన్నడూ ఏ పరిస్థితులలోనూ వాడకూడదు, విడకూడదు, రాలకూడదు. కలకాలం సుఖసంతోషాలతో వర్థిల్లండి...నా శుభకాంక్షలూ, ఆశీస్సులూ ఎల్లప్పుడూ మీకు తోడుగా వుంటాయి'' అని వెంటనే తలప్రక్కకు తిప్పుకున్నాడు.

జయసుధా, చక్రవర్తీ తేరుకుని ఏదో అనబోయే లోపలే ''వస్తాను'' అంటూ తలుపు తీసుకుని చరచరా బయటకు వెళ్ళిపోయాడు.

బయట ఉరుములూ మెరుపులూ, హోరుమని గాలివాన!

వాతావరణం భయంకరంగా వుంది.

చక్రవర్తి, జయసుధ బయటికి రాలేదు.

బయట స్తంభం పట్టుకుని ప్రేమ్‌కుమార్ చిన్నపిల్లవాని వలె ఎంతసేపు వెక్కి వెక్కి ఏడ్చాడో వారు గమనించనేలేదు.

(సంపూర్ణం)